క్లుప్తంగా

హీరో షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న రంగనాథ్

ఇల్లెందు: ఇల్లెందులో ఏర్పాటు చేసిన హీరో మోటార్ బైక్ షోరూంను శ్రీశ్రీశ్రీ సంస్థ ఎండీ ఈశ్వరప్రగడ రంగనాథ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ సంస్థకు సంబంధించిన అన్ని రకాల మోడళ్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ బాధ్యుడు యలమద్ది రవి పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



పోటీలను ప్రారంభిస్తున్న కోటిరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కొత్తగూడెం ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి సూచించారు. సోమవారం వర్క్‌పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో హాకీ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏరియా స్థాయిలోనే కాకుండా కంపెనీ, కోలిండియా స్థాయిలో విజయం సాధించి ఏరియాకు మంచి పేరుతేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మురళి, రజాక్, సాగర్, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఈ నెల 12, 13 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ఎనిమిదో మహాసభల ప్రచార పోస్టర్లను సోమవారం ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో పీవైఎల్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ అజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వాల వైఫల్యాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చల కోసం రాష్ట్ర మహాసభలు వేదిక కాబోతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో యాకూబ్‌షావలి, బోస్, బుర్ర వెంకన్న, పూనెం కుమార్, పాయం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం..

పాల్వంచరూరల్: అనర్హులకు గృహలక్ష్మి పథకం మంజూరు చేశారని, ఈ విషయమై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నాయకుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గృహలక్ష్మి మంజూరు పత్రాలు పంపిణీ చేసి డబ్బులు దండుకుంటున్నారని, గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. సమావేశంలో మావునూరి ప్రభాకర్, గంధం నాగేంద్ర, మాలోతు ప్రశాంత్, లక్ష్మణ్, అవినాష్, రమణ, రాధ, వెంకటమ్మ, సునీత పాల్గొన్నారు.

విఠల్‌రావు కృషితోనే దీపావళి బోనస్



మాట్లాడుతున్న నజీర్

టేకులపల్లి: సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్‌గా రూ.85 వేలు చెల్లించనున్నారని, టీవీ విఠల్‌రావు కృషితోనే బోనస్ అమలవుతోందని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ తెలిపారు. మండలంలోని కోయగూడెం ఓపెన్‌కాస్టులో సోమవారం జరిగిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.. పార్లమెంట్‌లో చట్టం చేయించి లాభాల బోనస్, ఎరియర్స్ ఇప్పించిన ఘనత ఆనాటి యూనియన్ అధ్యక్షుడు విఠల్‌రావుకే దక్కుతుందని చెప్పారు. షేక్ సర్వర్, బండి సీతారాములు, వెంగళ రవి, సామల శ్రీనివాస్, వెంకటనర్సయ్య, రామకృష్ణవారి పాల్గొన్నారు.

జోరుగా ఇసుక దందా

- అడ్డూఅదుపు లేకుండా తరలింపు
- రాత్రీ పగలు యథేచ్ఛగా అక్రమ రవాణా
- వాగు అడుగంటుతున్నా పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు
- ఇకనైనా స్పందించాలంటున్న ప్రజలు, రైతులు



మొర్రేడువాగులో ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని మొర్రేడువాగు నుంచి ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. రెవెన్యూ, పోలీసులు, భూగర్భశాఖ అధికారుల దాడులు లేకపోవడంతో వారి ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోయింది. అక్రమ ఇసుక రవాణా రాత్రి వేళ మొదలు పెడితే తెల్లవారుజాము వరకు కొనసాగిస్తున్నారు. ఈ ఇసుక దందాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు వస్తుండటం గమనార్హం. మొర్రేడువాగులో ఇసుక తీసేందుకు మధ్యలో పంట పొలాలను దాటి ట్రాక్టర్లు చెరువు లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే పొలాల నుంచి ప్రత్యేకంగా దారిని ఏర్పాటు చేసుకొని మరీ ఇసుక రవాణా చేస్తున్నారు. తద్వారా పంట పొలాల్లోనికి వర్షపు నీరు చేరి పంటలు నాశనం అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎవరికీ చెప్పిన కూడా ప్రయోజనం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే మొర్రేడువాగులో నుంచి తీసిన ఇసుక నుంచి ఇండియన్ గ్యాస్ రోడ్డు మీదుగా, హనుమాన్ ఆలయం పక్కన ఉన్న రోడ్డులో నుంచి, ఎస్‌కేటీ అపార్ట్‌మెంట్ పక్కదారి నుంచి టౌన్‌లోకి ఇసుక ట్రాక్టర్లు రావాల్సి ఉంటుంది. ట్రాక్టర్లు బయటకు వచ్చే మార్గంలో ఉన్న గాజులరాజంబస్తీ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఏరియా, హనుమాన్‌బస్తీ ఏరియా వారు ట్రాక్టర్ల శబ్దాలకు నిద్ర భంగం కలుగుతోందని, పగలంతా కూడా పనులు చేసి వచ్చి ఇంట్లో నిద్రపోవాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. అక్రమ ఇసుక రవాణాను సంబంధిత అధికారులు అడ్డుకొని చర్యలు చేపట్టాల్సిన అవసరముందని ఆయా ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కానరాని చర్యలు

కొత్తగూడెం పట్టణ పరిధిలోని మొర్రేడువాగు బ్రిడ్జి నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు సీజ్ చేయాల్సి ఉన్నప్పటికీ అటువైపుగా ఇరు శాఖల అధికారులు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోయింది. ట్రాక్టర్ ఇసుకను రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తూ ట్రాక్టర్ యజమానులు జేబులు నింపుకుంటున్నారు. అయితే ట్రాక్టర్లన్నీ కూడా సజావుగా రవాణా కొనసాగించేందుకు గానూ ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు పోలీసులు, రెవెన్యూ వారితో మధ్యవర్తిత్వం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. ట్రాక్టర్ శబ్దాలకు ఇబ్బంది ఎదురై డయల్ 100కు ఫోన్ చేస్తే అక్కడికి చేరుకున్న బీట్ కానిస్టేబుళ్లకు కూడా కొంత ముట్టజెప్పి, మళ్లీ అక్రమ రవాణాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నో ఏళ్లుగా మొర్రేడువాగు నుంచి ఇసుకను రవాణా చేయడంతో చెరువు అడుగంటిపోతోంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు, భూగర్భశాఖ అధికారులు కలిసి ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్పా అడ్డుకట్ట పడదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పాతకొత్తగూడెం, పెనుపల్లి నుంచి కూడా..

కొత్తగూడెం పరిధిలోని పాతకొత్తగూడెం ఆనుకొని ఉన్న పెనుపల్లి చెరువు నుంచి కూడా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ చెరువు నుంచి ప్రధానంగా ఎడ్లబండ్ల వారు, ట్రాక్టర్ల వారు రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కూడా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. అయితే, ఎడ్లబండ్ల వారు ఒక్క బండికి రూ.1000 నుంచి రూ.1500 వరకు కూడా వసూలు చేస్తున్నారు. ఇక ట్రాక్టర్ వాళ్లయితే ఒక ముఠాగా ఏర్పడి పోలీసులు, రెవెన్యూ అధికారులెవరూ అక్కడికి రాకుండా చూసుకుంటూ యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం

ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి, దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. అనుమతులు లేకుండా చెరువుల నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టడం చట్టరీత్యా నేరం. ఇసుక అక్రమ రవాణా రాత్రులు చేయడం వలన అక్కడి స్థానికులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది.

–పుల్లయ్య, తహసీల్దార్, కొత్తగూడెం

దళితులందరికీ దళితబంధు ఇవ్వాలి



సుజాతనగర్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సుజాతనగర్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులందరికీ ఒకేసారి దళితబంధు పథకాన్ని అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దళితులు 17 లక్షలకు పైగా ఉన్నారని, వారందరికీ ఒకే దఫాలో దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీర్ల రమేశ్, గండమల్ల భాస్కర్, మద్దెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ దళితబంధుతోపాటు గృహలక్ష్మి అమలు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ శారదకు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో భూక్య దస్రు, కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, వేల్పుల భాస్కర్, వీర్ల మల్లేశ్, కోమారి కృష్ణ, కత్తి వెంకన్న, జోనబోయిన కొమరయ్య, గార్ల రవి, రాంబాబు, పోడియాల ఆనంద్, బానోత్ హత్తిరామ్ పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్: దళితబంధు పథకాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కొండబోయిన వెంకటేశ్వర్లు, శ్రీను, వెంకన్న, కోటేశ్వరరావు, వినోద, లక్ష్మి పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందురూరల్: అర్హులందరికీ దళితబంధు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యాన దళితులు సోమవారం తహసీల్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు నబీ మాట్లాడుతూ దళితబంధు పథకాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలకు కాకుండా అర్హులకు మంజూరు చేయాలన్నారు. నాయకులు కోటమ్మ, సుజాత, నీలరాణి, రాంబాయి, భవాని, గీత, రాంకుమార్, సతీశ్, రఘు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుంది..



ఇల్లెందురూరల్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న కనకయ్య



చుంచుపల్లి: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎడవల్లి

ఇల్లెందురూరల్: రైతులకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై వ్యవసాయ అనుబంధ పరికరాలు ఇవ్వడమే కాక ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత కాంగ్రెస్‌దేనని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య స్పష్టం చేశారు. మండలంలోని పూబెల్లి, మిట్టపల్లిలో సోమవారం 280 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి సైదులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కనకయ్య మాట్లాడారు.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. ఆ తర్వాత మండలంలోని ఇందిరానగర్ గ్రామపంచాయతీలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని కనకయ్య ఆధ్వర్యాన నిర్వహించారు. సర్పంచ్‌లు పాయం స్వాతి, పాయం లలిత, కల్తి పద్మ, తాటి చుక్కమ్మతో పాటు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, తాటి యశోద, బానోత్ రోజా, మోకాళ్ల వెంకటమ్మ, ముక్తి కృష్ణ, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, తాటి భిక్షం పాల్గొన్నారు.

ప్రజలకు అండగా గ్యారంటీ పథకాలు

చుంచుపల్లి: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రాష్ట్ర ప్రజల కోసం ఆరు గ్యారంటీ పథకాలను సిద్ధం చేశారని, అవి ప్రజలకు అండగా నిలుస్తాయని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. సోమవారం చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డులో మండల అధ్యక్షుడు అంతోటి పాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా మాటలతో పబ్బం గడుపుతున్న సీఎం కేసీఆర్ చేతల్లో మాత్రం ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో రాయల శాంతయ్య, పల్లపు వెంకటేశ్వర్లు, శనగ లక్ష్మణ్, మహ్మద్ ఫక్రుద్దీన్, గులాం మతిన్, చారి, జెరీనా, కోటేశ్‌నాయక్, సుబ్బారెడ్డి, అంతోటి రాజు, రఘునాథ్, నాగరాజు, కొలిపాక సత్యనారాయణ, కనకమ్మ, మంగులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఇల్లెందు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు, డాక్టర్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ అధినాయకత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో కుంజ లక్ష్మి, మూతి సరస్వతి, ఇర్పా పద్మ, ఇర్పా శ్రీలత, పూనెం యశోద, ఇర్పా యశోద, ఇర్పా కుసుమ, ఇర్పా లక్ష్మి, విజయ, స్వరూప, అశోక్, ప్రతాప్, రమేశ్, రవి, ప్రశాంత్ ఉన్నారు. కార్యక్రమంలో జలీల్, సామ్రాట్, ఎట్టి హరికృష్ణ, వల్లాల రాజయ్య, అజీమ్ర రవి, వాంకుడోత్ నాగరాజు, ధన్‌సింగ్, ఇబ్రహీం, గడదాసు వెంకటేశ్వర్లు, ఫకృద్దీన్, వీరన్న, పాపారావు, రామారావు, హనుమంతు, కాయం రమేశ్, హరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అన్యాయమే..



మాట్లాడుతున్న బరగడి దేవదానం

పాల్వంచ: రాష్ట్రంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు బరగడి దేవదానం అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారని, రాష్ట్రంలో ఉన్న 89 వేల మంది ఆంధ్రా ఉద్యోగులను అక్కడికి పంపలేదని, ఇక్క మీ సేవ కేంద్రాలన్నీ ఆంధ్రా వారే నడిపిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు ఎండీ మంజూర్ అలీఖాన్, బహుజన ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు ఎస్‌డీటీ హుస్సేన్‌తోపాటు సీహెచ్ మునలయ్య, శ్రీపాద సత్యనారాయణ, గొడ్ల మోహన్‌రావు, తాళ్లూరి సత్యనారాయణ, నిమ్మల రాంబాబు, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

చేగువేరా, కాన్షీరాం వర్ధంతి..



పాల్వంచరూరల్: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో సోమవారం చేగువేరా, కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రమణకుమార్, వెంకటేశ్వర్లు, కృష్ణ, ఉదయ్, సంజయ్, రవి పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళులు

ఇల్లెందు: బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం 17వ వర్ధంతి బీఎస్పీ కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో బాదావత్ ప్రతాప్‌సింగ్, కాంతారావు, శ్రీనివాసరావు, రాయల శ్రీనివాస్, వినోద్, శ్రీను, మహేశ్, హరిలాల్, సురేశ్, లక్ష్మయ్య, సీతారాములు, కిరణ్, లోకేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: ఏఐవైఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం జూలూరుపాడులో చేగువేరా 56వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పగడాల అఖిల్, ఎస్కే చాంద్‌పాషా, బరగడ రమేశ్, పసుపులేటి పవన్, రేగముడి పుల్లారావు, గంజి మధు, వంశీ, కార్తీక్, సురేశ్, మహేశ్, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం గంగబిషన్‌బస్తీలోని ప్రభుత్వ స్థలాన్ని దక్కించుకునేందుకు తప్పుడు ధ్రువపత్రాలతో పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకుడు కొనుగోలు చేసినట్లు చెబుతున్నది ప్రభుత్వ స్థలమని, అయినా తప్పుడు పత్రాలతో పట్టాకు దరఖాస్తు చేసుకున్నందున క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే, పట్టణంలో ఆక్రమణలకు గురవుతున్న స్థలాలను కాపాడాలని కోరారు. సమావేశంలో నాయకులు గంధం మల్లికార్జున్‌రావు, నాగుల రవి కుమార్, వినయ్, నాని తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే సంక్షేమం

- ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు
- గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ



చుంచుపల్లి: గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: తొమ్మిదేళ్ల కాలంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్‌దేనని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచనలతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని చెప్పారు. పేద, బడుగు బలహీన వర్గాల కోసం అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలు ప్రజలకు భరోసాగా నిలిచిన కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలవాలని, కొత్తగూడెంలో తనను మరోమారు గెలిపించాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..

పాల్వంచ: కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిని తాను మాత్రమేనని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న టౌన్ హాల్‌కు శంకుస్థాపన చేశాక, ఐటీసీ సౌజన్యంతో రూ.కోటి నిధులతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. అలాగే, గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన అందజేసి మాట్లాడారు.

సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి నుంచి జగన్నాథపురం వరకు జాతీయ రహదారిపై సీఎస్ఆర్ పాలసీ నిధులు రూ.2.01 కోట్లతో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు సోమవారం ఎమ్మెల్యే వనమా పెద్దమ్మగుడి వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ మంజూరు చేయించానని తెలిపారు. కార్యక్రమాల్లో జెడ్పీ, డీసీఎంఎస్ వైస్ చైర్మన్లు కంచర్ల చంద్రశేఖరరావు, కొత్వాల శ్రీనివాసరావు, ఎంపీపీలు బాదావత్ శాంతి, మడివి సరస్వతి, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, మార్కెట్ చైర్మన్ భూక్యా రాంబాబు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, ఎంపీడీఓ అప్పారావు, సర్పంచ్ అనితతో పాటు వివిధ శాఖల అధికారులు, నాయకులు మురళి, నాగేశ్వరరావు, సత్యనారాయణ, అనిల్‌కుమార్, చంగల్‌రావు, కిలారు నాగేశ్వరరావు, మంతపురి రాజుగౌడ్, కనకేశ్, రామ్మూర్తి, విశ్వనాథం, వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, రాము, ప్రకాశ్‌రావు, చిరంజీవి, ప్రవీణ్, మల్లెల శ్రీరామ్మూర్తి, ముత్యాల వీరభద్రం, గంధం వెంగళరావు, నందానాయక్, కొండం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహార అలవాట్లు పెంపొందించుకోవాలి..



మాట్లాడుతున్న శశిధర్‌రాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సెక్యూరిటీ విభాగంలో పనిచేసే ప్రతిఒక్కరూ మంచి అలవాట్లను అలవర్చుకోవాలని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సి.శశిధర్‌రాజు పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో 10వ బ్యాచ్ సెక్యూరిటీ జమేదార్లకు పునఃశ్చరణ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ ద్వారా మానసిక, శారీరక దారుఢ్యం, వృత్తి నైపుణ్యం మెరుగవుతాయని తెలిపారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, వేణుమాధవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

టేకులపల్లి: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని తొమ్మిదో మైలుతండాకు చెందిన గుగులోత్ రాజు సోమవారం రాత్రి తన బైక్‌పై ఇల్లెందుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. రోళ్లపాడు క్రాస్ వద్ద కొత్తగూడెం నుంచి ఇల్లెందు వైపు వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజుకు తీవ్ర గాయాలు కాగా, ఇల్లెందు ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

కేటీఆర్‌ను కలిసిన వెంకట్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో నిర్వహించిన సభకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావును సోమవారం కొత్తగూడెం బీఆర్ఎస్ నాయకుడు కాసుల వెంకట్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ఇల్లెందురూరల్: మండలంలోని మొండితోగులో హెల్త్ సబ్ సెంటర్ ప్రహరీ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చీమల వీరభద్రం, ఎంపీటీసీ పూనెం సురేందర్ మాట్లాడారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ఆశా వర్కర్ల అరెస్ట్

జూలూరుపాడు: చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుత వాతావరణంలో ఆందోళనకు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత అక్రమంగా అరెస్టు చేయించడం సరికాదన్నారు. అరెస్టయినవారిలో భూక్యా శారద, కళ్లోజి లక్ష్మి, భూక్యా రుక్మిణి ఉన్నారు.

బీఆర్ఎస్ నేతల దాడిని ఖండించండి..



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఇల్లెందు: సింగరేణి ఆర్జీ–3లో విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డుపై బీఆర్ఎస్ నాయకులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అని, దీనిని నిరసిస్తూ ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెక్యూరిటీ సిబ్బంది సోమవారం ఎస్ అండ్‌పీసీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిట్ సహాయ కార్యదర్శి దాట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జీఎం కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న గార్డు నాగయ్యపై బీఆర్ఎస్ లడాన్‌పూర్ సర్పంచ్ భర్త బడికెల శ్రీనివాస్ అతడి అనుచరులతో కలిసి అకారణంగా దాడి చేశారని ఆరోపించారు. యాజమాన్యం స్పందించి ఇలాంటి దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కామరాజు, శ్రీనివాస్, రవి, బిందాలాల్, అన్వర్, పవన్‌కుమార్, భాస్కర్, రాంచందర్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

జేకే–5 ఓసీలో స్వచ్ఛత కార్యక్రమం



స్వచ్ఛత కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం జాన్‌ఆనంద్, పక్కన ఉద్యోగులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే–5 ఓసీలో సోమవారం ఏరియా అధికారులు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను పూర్తి చేయడంతోపాటు కార్యాలయం చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. ఏరియా జీఎం జాన్ ఆనంద్ మాట్లాడుతూ.. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా జేకే–5 ఓసీలో నాలుగు ప్రదేశాలను ఎంపిక చేశామన్నారు. శ్రీనివాస్, బొల్లం వెంకటేశ్వర్లు, పూర్ణచందర్, చెన్నయ్య, రవికుమార్, శివప్రసాద్, యూసుఫ్, సుధాకర్, వెంకటేశం, ధనుంజయ్‌రెడ్డి, అహ్మద్ పాల్గొన్నారు.